సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం | 6 | జూలై | 2025



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

రాయచోటి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 210 కేసులు పరిష్కరించినట్లు జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. -8లో



వైఎస్సార్‌సీపీ నాయకులకు స్విమ్స్‌లో వైద్య పరీక్షలు

వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న కేసులో బాధితులకు స్విమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.180	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1224 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

7,8 తేదీల్లో ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 7,8 తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. 7వతేదీన సబ్ జూనియర్ బాలుర జట్టు, 8వతేదీన జూనియర్, సబ్ జూనియర్ బాలికల జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 80966 607782 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన కింద తెలిజేసిన నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఏకుల రాజేశ్వరి (రాజంపేట), రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా మురళీధర్ (పీలేరు), రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధిగా సుంకర చక్రధర్ (పీలేరు), రాష్ట్ర ఎస్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎ.మల్లికార్జున (మదనపల్లె), స్టేట్ వైఎస్సార్ టీయూసీ కార్యదర్శిగా సి.చిన్న యల్లప్ప (పీలేరు), స్టేట్ వైఎస్సార్ టీయూసీ సంయుక్త కార్యదర్శిగా ఆర్.సంజీవయ్య (రాయచోటి)లను నియమించారు.

రాయచోటి ఘటనపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు: ఎస్పీ

రాయచోటి: రాయచోటిలో తీవ్రవాదుల సంఘటన గురించి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. ఈమేరకు శనివారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ భద్రతకు భంగం కల్గించేలా సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసినా, అవాస్తవాలను సృష్టించినా, వదంతులు ప్రసారం చేసినా, షేర్ చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో గ్రూప్ అడ్మిన్‌లు ప్రతి సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఆయా గ్రూపులలో తప్పుడు సమాచారం వస్తే గ్రూప్ అడ్మిన్లపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. రాయచోటిలో చోటు చేసుకున్న ఘటన జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ విషయంపై ఈనెల 3వ తేదీన పత్రికా ప్రకటన జారీ చేశామన్నారు. దీనిపై కేంద్ర దర్యాప్తు బృందం విచారణ చేస్తున్నట్లు చెప్పారు. కావున ఎటువంటి విషయాలు ఉన్నా అధికారికంగా జిల్లా పోలీసులు తెలియజేస్తారన్నారు. సమాజంలో మీడియా పాత్ర విలువైందని, పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఏదైనా విషయానికి సంబంధించి పోలీసు అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని ఎస్పీ తెలియజేశారు.

మనోళ్లే బిల్లులు ఇచ్చేద్దాం!

- రూ.150 కోట్ల బిల్లులు చెల్లింపునకు సిద్ధం
- పీఏఓ నుంచి నేడో రేపో మంజూరు
- పీబీసీలో రూ.10 కోట్ల మేర అడ్వాన్స్‌ల చెల్లింపు?
- స్వామిభక్తి చాటుకుంటున్న హంద్రీ–నీవా అధికారులు



పుంగనూరు ఉపకాలువలో షార్ట్ క్రీటింగ్ జరిగినా కనిపిస్తున్న బండరాళ్లు



కాలువలో అసంపూర్తి పనులు

రూ.10 కోట్ల అడ్వాన్స్?



పుంగనూరు ఉపకాలువకు సంబంధించిన పనుల విషయంలో డీఈ వెంకట ప్రతాప్ కాంట్రాక్టు సంస్థ పనులు చేయకనే అడ్వాన్స్ రూపంలో రూ.10 కోట్లకుపైగా మంజూరు చేశారని సమాచారం. ఈ అడ్వాన్స్, జరిగిన పని కలుపుకుని తాజాగా బిల్లులు పెట్టారని తెలిసింది. పని జరక్కనే అడ్వాన్స్ రూపంలో బిల్లులు ఇవ్వడం జరగదు. అయినప్పటికీ ఇచ్చారని చెబుతున్నారు. దీనిపై డీఈ వెంకట ప్రతాప్ వివరణ కోరగా అడ్వాన్స్ నిధులు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు.

మదనపల్లె: ఏదైనా అభివృద్ధి పని జరిగితే పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించడం ఉండదు. అందులోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించారా లేదా అని ఒకటికి రెండుసార్లు పర్యవేక్షించి, పరిశీలించాక..క్వాలిటీ కంట్రోల్ అధికారుల ధృవీకరణ ఇచ్చాక బిల్లులు పెడతారు. ఇందులోనూ జరిగిన మొత్తం పనికి బిల్లు పెట్టడం ఎక్కడా ఉండదు. కొంత బిల్లు తగ్గిస్తారు. అయితే హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండోదశ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పెద్దగా పట్టించుకోని అధికారులు స్వామిభక్తిని చాటుకుంటున్నారు. అందుకు నిదర్శనం పుంగనూరు ఉపకాలువ (పీబీసీ), కుప్పం ఉపకాలువ (కేబీసీ) పనులే. ఈ పనులకు సంబంధించి ఇంకా పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో అంచనాకు రాకముందే బిల్లులన్నీ చెల్లించేందుకు సిద్ధమై అందుకు చర్యలన్నీ పూర్తి చేశారు.

పనులు విలువ రూ.536 కోట్లు

పీబీసీలో 117.767 కిలోమీటర్ల లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులను ప్రభుత్వం నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ.480.22 కోట్లతో నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టింది. తర్వాత ఈ పనుల విలువను రూ.366 కోట్లకు కుదించి కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకుంది. కేబీసీకి సంబంధించి రెండు రీచ్‌లుగా పనులకు టెండర్లు నిర్వహించగా సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ ఎక్సెస్‌తో పనులు దక్కించుకుంది. ఒకటో రీచ్‌ను రూ.81,43,61,130తో టెండర్ పలవగా రూ.85,46,72,008 కోట్లకు, రెండో రీచ్‌ను రూ.80,35,99,740 కోట్లతో టెండర్ పిలవగా రూ.84,33,77,923 కోట్లతో రిత్విక్ ప్రాజెక్ట్స్ పనులు దక్కించుకుంది. ఈ మేరకు ఏప్రిల్‌లో కాలువల పనులు మొదలయ్యాయి.

చకచకా రూ.150 కోట్ల బిల్లులు

రెండు ఉప కాలువలకు సంబంధించి జరిగిన పనులపై ప్రాజెక్టు అధికారులు వెంటనే బిల్లులకు సిద్ధమయ్యారు. కుప్పం కాలువ పనులు సీఎం చంద్రబాబు సన్నిహితుడైన ఎంపీ సీఎం రమేష్ సంస్థ కావడంతో పనులు చాలా వేగంగా జరిగాయని, వాటికి అంచనా కట్టిన అధికారులు బిల్లుల మంజూరుకు ఆగమేఘాల మీద రికార్డులు సిద్ధం చేశారు. మొదటి రీచ్‌కు రూ.42,58,17,772, రెండో రీచ్‌కు రూ.44,81,98,813, పుంగనూరు కాలువకు రూ.60 నుంచి 63 కోట్లలోపు బిల్లులను సిద్ధం చేసి కాంట్రాక్టు సంస్థలకు చెల్లింపులు జరిగేలా చిత్తూరు పే అంట్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయానికి నివేదించారు. ఈ స్థాయిలో ఒకేసారి బిల్లులు పెట్టడం అరుదైన విషయమని ప్రాజెక్టు అధికారుల్లోనే చర్చ జరుగుతోంది. దీనికి ముఖ్యంగా అధికారుల్లో చోటుచేసుకున్న స్వామిభక్తే కారణమని అంటున్నారు. 90 కిలోమీటర్ల కుప్పం కాలువ పనుల పర్యవేక్షణ బాధ్యత కేవలం ఒక ఈఈ, ఒక డీఈకే అప్పగించారు. పుంగనూరు కాలువకు సంబంధించి కూడా ఒకరిద్దరు డీఈలకే ఎక్కువ కిలోమీటర్ల పనులు అప్పగించారు. వీరి పర్యవేక్షణ పరిధిలోని పనులకే ఎక్కువ మొత్తంలో బిల్లులు పెట్టినట్టు తెలుస్తోంది. వీరికి కాలువ పనుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఇలా బిల్లుల రూపంలో భక్తి ప్రదర్శిస్తున్నట్టు స్పష్టం అవుతోంది.

సీఈ నివేదికలోగా జరిగిపోవాలి

ఈస్ట్‌కోస్ట్ క్వాలిటీ కంట్రోల్ సీఈ శేషుబాబు ఈ రెండు కాలువల్లో జరుగుతున్న పనులను పూర్తిగా పరిశీలించారు. గతంలో ఏ అధికారి కూడా పనుల నాణ్యతపై కాలువల్లో జరిగిన పని మొత్తాన్ని పరిశీలించిన దాఖలాలేవు. అయితే శేషుబాబు మొత్తం పరిశీలించి వెళ్లగా, దీనిపై నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. పరిశీలన ముగిసి ఒకరోజు మాత్రమే గడవడంతో ఆ నివేదికలో ప్రతికూల అంశాలను ప్రస్తావిస్తే బిల్లుల చెల్లింపుపై ప్రభావం చూపుతుందని అధికారులు పీఏఓ కార్యాలయ అధికారులపై ఒత్తిడి తెస్తూ బిల్లులకు ఆమోదం తెలిపి మంజూరు చేయాలని కోరుతున్నట్టు తెలిసింది. నివేదిక ప్రభుత్వ పరిశీలనలోకి వెళ్లాక బిల్లులకు బ్రేక్ పడే అవకాశం ఉండొచ్చని అధికారులు భావిస్తున్న తరుణంలో ఒత్తిళ్లతో ఒకట్రెండురోజుల్లో మొత్తం బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులే చెబుతుండటం విశేషం.

పర్యవేక్షణ లేదనే సీఈ రాక

రెండు ఉపకాలువల లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనుల విషయంలో తిరుపతి క్వాలిటీ కంట్రోల్, మదనపల్లె ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడంవల్లే క్వాలిటీ కంట్రోల్ సీఈ శేషుబాబు విచారణకు వచ్చినట్టు చెబుతున్నారు. సీఈ పరిశీలనతో ఇక్కడి క్వాలిటీ కంట్రోల్ అధికారుల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడి అధికారులు కాంట్రాక్టు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ఈ పరిస్థితుల్లో జరిగే పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

వైభవం..ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నందలూరు: నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సునీల్‌కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సాయిస్వామి ఆధ్వర్యంలో ధ్వజ స్తంభంపై గరుడ చిహ్నంతో ఉండే పతాకాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి యాలివాహనంలో పురవీధుల్లో ఊరేగుతూ భక్తజన కోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రి హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



యాలివాహనంపై దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్‌ను ఈ నెల 10న నిర్వహిస్తున్నామని, తల్లి పేరుతో ప్రతి విద్యార్థి మొక్క నాటడం ద్వారా తల్లిదండ్రులు, పర్యావరణం పట్ల బాధ్యత పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పిల్లల తల్లిదండ్రులను పాఠశాలలతో సమన్వయం చేసి విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టుల గురించి తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవి, పాఠశాల విద్యాశాఖ ప్రతినిధి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక



పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పులివెందులకు రానున్నారు. సోమవారం సాయంత్రం 5గంటలకు ఆయన హెలికాప్టర్ ద్వారా పులివెందులలోని భాకరాపురంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఆ రోజు పులివెందులలోనే బస చేయనున్నారు. మంగళవారం ఉదయం దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా ఇడుపులపాయకు చేరుకుని అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్ నివాళులర్పించనున్నారు. అక్కడ నుంచి పులివెందులకు చేరుకుంటారు. మంగళవారం సాయంత్రం బెంగుళూరుకు బయలుదేరి వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

పర్యటన వివరాలు: ఈనెల 7న సాయంత్రం పులివెందులలోని భాకరాపురం హెలీప్యాడ్‌కు 5గంటలకు చేరుకుంటారు. ఈనెల 8న మంగళవారం ఉదయం పులివెందులలోని తన స్వగృహం నుంచి ఉదయం 6.45గంటలకు వాహనంలో రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 7.30గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్దకు చేరుకుంటారు. 8.15గంటల వరకు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 8.45గంటలకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు చేరుకుంటారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు పులివెందుల క్యాంప్ ఆఫీస్‌లో ప్రజలతో మమేకం కానున్నారు.

ఎవరికీ చెప్పకోలేఖ!

- చదువుకోలేక పోతున్నందుకు చావే శరణ్యమంటూ నిర్ణయం
- ఫీజు విషయమై కాలేజీ యాజమాన్యం అవమానించారని ఆవేదన
- లేఖ రాసి ఇంటినుంచి అదృశ్యమైన ఫార్మసీ విద్యార్థిని
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు
- తిరుపతిలో దొరికిన ఆచూకీ



శ్వేతశ్రీ చంద్ర (ఫైల్)



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు

మదనపల్లె: 'అమ్మా..నాన్నలకు.. నేను ఈ ఒత్తిడి చదువు చదవలేకపోతున్నా. మీకు చాలాసార్లు ఈ విషయం చెప్పాను. అయినా నావల్ల కావడం లేదు. నేను సున్నితం అని మీకు తెలుసు కద నాన్నా.. అందుకే చచ్చిపోవాలని నిర్ణయం తీసుకున్నా..' అంటూ మదనపల్లె రూరల్ మండలం సీటీఎం గ్రామంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మూడో ఏడాది ఫార్మసీ కోర్సు చదువుతున్న విద్యార్థిని శ్వేతశ్రీ చంద్ర (21) రెండు పేజీల లేఖ రాసి శుక్రవారం ఇంటినుంచి అదృశ్యమైన ఉదంతం సంచలనం కలిగిస్తోంది. లేఖలో ఫీజు విషయంగా ప్రస్తావించి అవమానపడినట్టు ఆవేదనకు గురైంది. విద్యార్థిని విషయంలో కళాశాల యాజమాన్యం కఠినంగా వ్యవహరించడం ప్రధాన కారణమా అన్న చర్చ సాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు మదనపల్లె రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు..

- పెద్దతిప్పసముద్రం మండలం పట్టెంవాండ్లపల్లెకు చెందిన సూర్యనారాయణ కుటుంబం కుమార్తె శ్వేతశ్రీచంద్ర చదువుకోసం సీటీఎం నేతాజీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇక్కడి ప్రైవేటు ఫార్మసీ కళాశాలలో చదివిస్తున్నారు. అయితే చదువు విషయంలో తనకు ఇబ్బందులున్నాయని లేఖ ద్వారా తల్లిదండ్రులకు చెప్పుకున్నా వెలుగులోకి రాని కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో విచారణ సాగాల్సి ఉంది. తల్లిదండ్రులపేరుతో విద్యార్థిని శ్వేతశ్రీచంద్రరాసిన లేఖలో 'అమ్మా..నాన్నలకు.. నన్ను ఇక్కడ చదివించాలని అనుకుంటున్నారు. కాని నేను చదవలేను. నాకు ఈ ఒత్తిడి భరించడం, బాధపడటం నా వల్ల కావడం లేదు. ఈ కళాశాలలో నేను చదవలేను. మీరు ఎన్ని చెప్పినా వినను. నేను మానసికంగా చాలా ఒత్తిడి భరిస్తున్నాను. ఇంకా చెప్పాలంటే నా మెంటల్ కండిషన్ ఏమీ బాగలేదు. నాకు చచ్చిపోవడం తప్ప వేరే మార్గం దొరకడం లేదు. నేను చెప్పి చెప్పి అలసిపోయాను. అందుకే చచ్చిపోవాలని డిసైడ్ అయిపోయా. ఇక్కడ చదువుతూ అవమానపడటం నావల్ల కాదు. నాకు మీతో చెప్పే ధైర్యం లేదు. బతకడానికి ధైర్యం సరిపోవడం లేదు. అందుకే దూరంగా వెళ్లి చచ్చిపోతున్నా. నేను సున్నితం అని తెలుసు కదా, అందుకే నేను ఈ డెసిషన్ తీసుకున్నాను. ప్రతిసారీ ఈ కాలేజీలో వాళ్లు ఫీజు కోసం అవమానపర్చడం, నేను ఫీజు కట్టకుండా అవమానంగా ఒకదాన్నే తలదించుకుని ఉండటం నావల్లకాదు డాడీ. మళ్లీ మళ్లీ మీకు చెప్పి ఇబ్బంది పెట్టలేను. అందుకే నేను చచ్చిపోవాలని ఫిక్స్ అయిపోయా డాడీ. అయామ్ వేరీ' అంటూ చాలా విషయాలను రాసింది. ఈ రెండు పేజీల లేఖలో ఒకచోట ఈనెల రెండో తేదీన రాసినట్టు తేది, సంతకం చేసింది. తర్వాత అదేపేజీలో రాసిన విషయాల కింద మూడో తేదీ వేసింది. ఇంకో పేజీలో ఐయామ్ సారీ, గుడ్‌బై అంటూ పలుచోట్ల రాసింది. అంటే ఈ లేఖను రెండు రోజుల్లో రాసినట్టుంది.

నిన్ను వదిలి ఉండలేం తల్లీ వచ్చేయి

కన్నీటిపర్యంతమైన శ్వేతశ్రీ తల్లిదండ్రులు



విలపిస్తున్న సూర్యనారాయణ, సుజాత

తమబిడ్డ ఫీజు కట్టలేదని కళాశాలలో ఫోటో తీసి కళాశాల యాజమాన్యం అవమానించిందని విద్యార్థి శ్వేతశ్రీ చంద్ర (21) తల్లిదండ్రులు సూర్యనారాయణ, సుజాత కన్నీటిపర్యంతమయ్యారు. శ్వేతశ్రీ అదృశ్యంపై ఫిర్యాదు చేశాక శనివారం సాయంత్రం వారు మీడియాతో మాట్లాడుతూ ఆవేదన చెందారు. తమబిడ్డ మహతి ఫార్మసీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోందని చెప్పారు. మొదటి, రెండో సంవత్సర ఫీజులు చెల్లించామని, మూడో ఏడాదికి చెందిన ఫీజులో కొంత మొత్తం గత శనివారం కట్టాం, మిగిలింది ఈ శనివారం చెల్లించేందుకు సిద్దమైనట్టు చెప్పారు. ఈ విషయమై కళాశాలకు వెళ్లి తమబిడ్డను చదువుకోనివ్వాలని వేడుకోగా ప్రిన్సిపాల్ బాబు అవమానకరంగా మాట్లాడారని అన్నారు. తర్వాత కళాశాలకు వెళ్లిన శ్వేతశ్రీ చంద్రను ఫీజు కట్టలేదని ఫోటో తీసి అవమానించారని విలపించారు. నా బిడ్డను కాపాడండి ఆమె లేకుండా ఉండలేం.. ఆమె డాడి అసలే బతకలేడు అంటూ సుజాత విలపించింది. కాగా కళాశాలలో శ్వేతశ్రీని ఎవరూ అవమానించలేదని, రెండు సంవత్సరాల ఫీజు పెండింగ్‌లో ఉందని, ఇంకా కట్టలేదని మహతి కళాశాల కరెస్పాండెంట్ అమరనాథరెడ్డి చెప్పారు.

ఫిర్యాదుపై కేసు నమోదు

ఇంటినుంచి అదృశ్యమైన కుమార్తె శ్వేతశ్రీచంద్ర లేఖ చూడగానే తల్లిదండ్రులు, బంధువులు మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ చేరుకుని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి శనివారం ఫిర్యాదు చేశారు. తండ్రి సి.సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గాయత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మహతి ఫార్మసీ కళాశాలలో చదువుతున్న శ్వేతశ్రీచంద్ర శుక్రవారం ఉదయం కళాశాలకు బయలుదేరగా తర్వాత అదృశ్యమైంది. తర్వాత పలుచోట్ల ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో శనివారం తమకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టినట్టు చెప్పారు. శ్వేతశ్రీచంద్ర శుక్రవారం ఉదయం 11.30–12 గంటల మధ్య ఇంటినుంచి వెళ్లినట్టు గుర్తించామని, ప్రస్తుతం ఎక్కడుందో కనిపెట్టేందుకు సాంకేతిక సహకారంతో చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

- శ్వేతశ్రీచంద్ర తిరుపతిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో పోలీసులు తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కురబలకోట ; కురబలకోట మండలం ముదివేడు మార్గంలో శనివారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. అంగళ్లలో గొర్రెల సంతలో గొర్రెలు విక్రయించి బొలెరో వాహనంలో పెద్దమండ్యం, ముసలికుంటకు వెళుతుండగా ముదివేడు ఫారెస్టు మార్గంలో ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొంది. హఠాత్తుగా బ్రేక్ వేయడంతో బొలెరా వాహనం కూడా బోల్తాపడింది. ఈ ఘటనలో బొలెరో లోని దట్టినాయక్ తాండాకు చెందిన కృష్ణా నాయక్ (60), బాలాజీ నాయక్ (30), బంద్రేవు లక్ష్మయ్య (50), ముసలికుంట మల్‌రెడ్డి (45), రామాంజనేయ రెడ్డి (28)గాయపడ్డారు. బైక్‌లో వస్తున్న గాలివీడు ప్రాంతం బలిజ పల్లెకు చెందిన మహేష్ (32) కూడా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో నిర్బంధించి దురుసుగా ప్రవర్తించారు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె సిటీ : గౌతమ బుద్ధుని తల నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన దీక్ష చేస్తుంటే ఎస్పీ ఆదేశాలతో పోలీసు స్టేషన్‌కు తరలించి దురుసుగా ప్రవర్తించారని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ ఆరోపించారు. జిల్లా ఎస్పీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. శనివారం స్థానిక బెంగళూరు రోడ్డులో దీక్ష శిబిరం వద్దకు పోలీసులు వద్దకు వచ్చి దురుసుగా ప్రవర్తించి బలవంతంగా నెట్టివేశారన్నారు. దీంతో ఎడమ మోకాలిపై గాయమైందన్నారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. శివప్రసాద్‌ను బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గణపతి, పాలకుంట శ్రీనివాసులు, ముత్యాల మోహన్, బాస్ నాయకులు ఆస్పత్రికి వచ్చి పరామర్శించారు.

ఈ యాప్‌పై ఓ లుక్ వేయాల్సిందే!

- లుక్ యాప్ పేరుతో భారీ దోపిడీ
- ఒకసారి డిపాజిట్ చేస్తే రోజూ డబ్బులు ఇస్తామని మోసం
- వెలుగులోకి వచ్చిన కొత్తరకం మోసం



ఖాజీపేట : ప్రతి మనిషికి ఆశ ఉంటుంది.. తక్కువ పెట్టుబడి డబ్బుతో ఎక్కువ లాభం వస్తుందంటే మనిషి కనీస వివేకం కోల్పోతాడు. మనుషుల్లోని ఈ బలహీనతను ఆధారంగా చేసుకుని లుక్ యాప్ ద్వారా భారీ దోపిడీ చేసిన సంఘటన కొత్తగా వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరాల పట్ల కేంద్ర ప్రభుత్వం ఎంతగా అవగాహన కల్పిస్తున్నా కొత్త కొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తూ అత్యాశపరులను సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే..

లుక్ యాప్ ద్వారా ఒక సారి డిపాజిట్ చేస్తే ప్రతిరోజు ఆదాయం పొందవచ్చన్న కొత్త రకమైన ఆలోచన ద్వారా సైబర్ నేరగాళ్లు కొత్త రకమైన యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్ గురించి వాట్సాప్ ద్వారా అలాగే వివిధ రకాల సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. రోజు వారి ఆదాయం వారంలో డబ్బు విత్‌డ్రా చేసుకోవచ్చని అందరిని బురిడీ కొట్టించారు. ఇదికాక ఒకరు డిపాజిట్ చేసిన తరువాత మరో 10 మందిని డిపాజిట్ చేయిస్తే వారి కి ప్రమోషన్ ద్వారా అదనపు ఆదాయం వస్తుందని మోసానికి పాల్పడ్డారు. అలాగే డిపాజిట్ చేసిన వ్యక్తి అమైంట్‌ను బట్టి వారికి రోజు ఆదాయం వస్తుందని ఆశ చూపించారు. ఇందులో రూ.2వేల నుంచి రూ.70లక్షల వరకూ డిపాజిట్ చేసే ఏర్పాట్లు చేశారు. డిపాజిట్ మొత్తాన్ని బట్టి రోజు వారి ఆదాయం గురించి వివరించారు. రూ.2వేలు డిపాజిట్ చేస్తే ప్రతి రోజు రూ.150, రూ.70వేలకు రోజుకు రూ.2500 ఇలా వివిధ కేటగిరీలను బట్టి రెండేళ్లపాటు ఆదాయం వస్తుందని నమ్మించారు. అలాగే వారంలో ఒకసారి వచ్చిన మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. మొదట్లో రెండు వారాలు అందరికి డబ్బులు బాగానే వేశారు. దీంతో నమ్మకం కలిగి చాలా మందిని ఈ లుక్ యాప్‌లోకి చేర్పించారు. సభ్యుల సంఖ్య వందల నుంచి వేలకు చేరింది.

25 నుంచి పని చేయని యాప్..

వందల సంఖ్య నుంచి వేల సంఖ్యలోకి చేరిన బాధితులు ఇలా లక్షల్లో యాప్‌లో డబ్బులు వేశారు. ఒక్క ఖాజీపేట మండలంలోనే 200 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు రూ.2వేల నుంచి సుమారు మూడు లక్షల రూపాయల వరకూ డిపాజిట్ చేసినట్లు సమాచారం. ఒక్క ఖాజీపేటలోనే రూ.20లక్షల నుంచి రూ.30 లక్షల డబ్బు డిపాజిట్ చేసి మోసపోయినట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా 2వేల మందికి పైగానే బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తం చూస్తే సుమారు రూ.30 కోట్ల మేరకు డబ్బు డిపాజిట్ చేసి మోసపోయినట్లు అంచనా. పూర్తి స్థాయిలో విచారణ జరిగితే ఈ మొత్తం ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. కడపలోని ఒక్క వాట్సాప్ గ్రూప్ యాప్‌లోనే రూ.3కోట్లు పోయినట్లు సమాచారం. ఇలాంటి గ్రూపులు జిల్లాలో చాలా ఉన్నాయని తెలుస్తోంది. అయితే గత నెల 25 నుంచి సాంకేతిక కారణాలతో యాప్‌ను పూర్తిగా రద్దు చేసినట్లు బాధితులు వాపోతున్నారు. డిపాజిట్ సొమ్ముకు రోజువారి డబ్బు విత్‌డ్రా లేకపోవడం, యాప్ పనిచేయక పోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

వినాయక విగ్రహం చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

పెనగలూరు : పెనగలూరు మండలం ఓబిలి స్కూల్ ఆవరణంలో గత నెల 24వ తేదీ వినాయక విగ్రహాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ బీవీ రమణ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నందలూరు మండలం మదనగోపాలపురం గ్రామానికి చెందిన చుక్కా రవి ఆధ్వర్యంలో పది మంది పురుషులు, ముగ్గురు మహిళలు కలిసి వినాయక విగ్రహాన్ని చోరీ చేశారు. నిందితుల్లో రవితో పాటు పాత చిట్వేలికి చెందిన కనిశెట్టి వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు, ఆర్.భాస్కర్, ఈటమాపురానికి చెందిన చంద్ర, బైరాజు, సుధాకర్ రాజులతోపాటు చుక్కారవి వియ్యంకుడు నెల్లూరు జిల్లా మనుబోలుకు చెందిన సురేష్, నెల్లూరులోని రాపూరు లక్ష్మమ్మ, మునిస్వామి, వేలు రెడ్డి, పూజారి గోకిల రమేష్, ముసునూరు పుల్లారెడ్డి, పెనగలూరుకు చెందిన దాసరి వెంకట నరసమ్మ, సుఖదేవ్ కలక్వాడ్ శ్యామ్‌లు ఉన్నారు. వినాయక విగ్రహాన్ని బయటకు తీసి ట్రాక్టర్‌కు కట్టుకొని ఓదేటావారిపల్లి గ్రామానికి వెళ్లే దారి వరకు ఈడ్చుకుంటూ వెళ్లి అక్కడ ట్రాక్టర్‌లో ఎక్కించుకొని నేరుగా ఈటమాపురం చెరువులోకి తీసుకెళ్లారన్నారు. చెరువులో విగ్రహాన్ని దింపి గుప్త నిధులకోసం పూజలు చేసి సమ్మెటతో రాతి వినాయక విగ్రహాన్ని పగులకొట్టి పడేశారన్నారు. పూర్వకాలంలో వజ్రాలు, బంగారం రాతి విగ్రహంలో పెట్టి ఉంటారనే నమ్మకంతో వీరు విగ్రహాన్ని చోరీ చేసి పగులకొట్టారని తెలిపారు. ఎలాంటి నగలు దొరకకపోవడంతో పగులకొట్టిన విగ్రహం ముక్కలను కుంటలో పడేశారన్నారు. కొండూరు క్రాస్ వద్ద శనివారం వీరు గుంపుగా ఉండటంతో విచారించగా గత నెలలో వినాయక విగ్రహం చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి ఒక ఇన్నోవా కారు, నాలుగు మోటార్ సైకిళ్లు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులకు రివార్డు కోసం ఎస్పీకి ప్రతిపాదించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు సుబ్బరాయుడు, రవిశంకర్, సిబ్బంది రాముడు, నాగయ్య, గోపాలకృష్ణ, సుజిత, నాగేశ్వరమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 210 కేసులు పరిష్కారం



న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కక్షిదారులకు నగదు అందజేస్తున్న న్యాయవాదులు

రాయచోటి టౌన్ : రాయచోటి కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 210 కేసులు పరిష్కరించినట్లు జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి టి. కేశవ, జూనియర్ సివిల్ జడ్జి పి. రాజన్ ఉదయ్ ప్రకాష్‌లు తెలిపారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిష్కారమైన 210 కేసుల్లో 204 కేసులు క్రిమినల్ కేసులు కాగా, మిగిలిన ఆరు సివిల్ కేసులు అని తెలిపారు. ఈ కేసుల ద్వారా కక్షిదారులకు మొత్తం 62 లక్షల, 24 వేల, 466 రూపాయలు చెల్లించినట్లు పేర్కొన్నారు. వీటిలో ప్రధానంగా భార్యాభర్తలకు సంబంధించిన వివాదంలో 20 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతానికి 15 లక్షల రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. అలాగే ఒక చెక్ బౌన్స్ కేసులో రూ.2,49,000 చెల్లించారన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరమే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీపీటీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సీనియర్ న్యాయవాది పీఎస్ శ్రీనివాసులు, జి.రామచంద్రయ్య, మోహన్ బాబు, కె. చంద్రమోహన్ రెడ్డి, జి. సురేంద్ర, వీవీ రమణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం మోటకట్ల సమీపంలో కారు– ఆటో ఢీ కొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామానికి చెందిన జయనారాయణరెడ్డి, అలివేలమ్మ, రెడ్డెమ్మలు సొంత పనుల నిమిత్తం కారులో రాయచోటి వెళుతుండగా మోటకట్ల మిట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా ఆటో రావడంతో అదుపు తప్పి రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ జాన్‌తో పాటు కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ రామలక్ష్మీ

సుండుపల్లె : బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల రక్షణ అధికారి రామలక్ష్మీ అన్నారు. శనివారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహం చేయడం నేరమని అందుకు సహకరించిన వారికి లక్ష రూపాయలు జరిమానాతో పాటు రెండు సంవత్సరాలు జైలుశిక్ష పడుతుందని తెలిపారు. పాఠశాలలో గానీ ఇతర ప్రదేశాలలో గానీ పిల్లలను వేధించడం, పిల్లలకు తెలియకుండా ఇతర ప్రదేశాలకు తరలించడం వంటి పనులు ఎక్కడైనా జరిగితే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ కో ఆర్డినేటర్ రవీంద్రనాథ్, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలాజీ

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని టి. చదిపిరాళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం పట్టణం రాం నగర్‌కు చెందిన ముద్దల బాలాజీ (29) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మృతుడు మండలంలోని భారతి సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం బాలాజీ తన విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో మార్గ మధ్యంలో టి.చదిపిరాళ్ల వద్దకు రాగానే కమలాపురం నుంచి ఎర్రగుంట్ల వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ విద్యా సాగర్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు చిన్న వయస్సు గల కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. బాలాజీ మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

టపాసులు పేల్చిన కేసులో విచారణ



కుర్నూతల అగ్రహారంలో సీఐడీ ఎస్పీ విచారణ

లక్కిరెడ్డిపల్లి : టపాసులు పేల్చిన సంఘటనలో లోకేష్ అనే వ్యక్తి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం తిరుపతి సీఐడీ ఎస్పీ శ్రీనివాసులు విచారణ చేపట్టారు. తమ సిబ్బందితో కలిసి మండలంలోని కుర్నూతల అగ్రహారంలో గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, వీఆర్ఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మట్టికోసం తమ్ముళ్ల కుమ్ములాట

చమర్తి, మేడా వర్గీయుల బాహాబాహీ

రాజంపేట : ఒంటిమిట్ట చెరువు మట్టి కోసం తెలుగు తమ్ముళ్లు కుమ్ములాడుకున్నారు. శనివారం రాత్రి స్థానిక హరితా హోటల్‌లో టీడీపీ రాజంపేట నేత చమర్తి జగన్ మోహన్ రాజు వర్గీయులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి వర్గీయులు ఒంటిమిట్ట చెరువు మట్టిని దోచుకోవాలని మేమంటే మేము అంటూ బాహా బాహీ ప్రదర్శనకు దిగారు. రెండు నెలలుగా ఒంటిమిట్ట చెరువులో టీడీపీ నాయకులు రైతుల ముసుగులో మట్టి మాఫియా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీడీపీలోని ఒక వర్గం వారే చెరువు మట్టిని దోచుకుని సొమ్ము చేసుకుంటున్నారని, దోచుకున్నంత వరకు చాలు, ఇక మీరు ఆపితే తాము కూడా ఒంటిమిట్ట చెరువు మట్టిని తోలుకుని సొమ్ము చేసుకోవాలని ఒకరిని ఒకరు ఎదురెదురుగా విమర్శించుకున్నారు. దీంతో మాట మాట పెరిగి తీవ్రస్థాయిలో ఇరు వర్గాలు దూషించుకుని, తోపులాటతో ఘర్షణ తారా స్థాయికి చేరింది. ఇంతలో వీరి ఇరు వర్గాల మధ్య హరితా హోటల్ మేనేజర్ రాజశేఖర్ సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఘర్షణలో ఒంటిమిట్ట చెరువులో మట్టి మాఫియా చేసేందుకు ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకట రామయ్య చమర్తి వర్గానికి మద్దతు ఇస్తున్నారని విమర్శించుకోవడం గమనార్హం.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్
- నాలుగో రోజుకు చేరిన విద్యార్థుల రిలే నిరాహార దీక్షలు



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యూనివర్సిటీ వద్ద విద్యార్థులు చేస్తున్న నాలుగో రోజు నిరవధిక నిరాహార దీక్షలకు ఆయన సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్కిటెక్చర్ యూనివర్సిటీని నెలకొల్పారన్నారు. గత ప్రభుత్వంలోనే జీఓ నంబర్–42 ద్వారా యూనివర్సిటీలో లెక్చరర్లు, ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆ పోస్టులను ఈ ప్రభుత్వం భర్తీ చేసి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ) పర్మిషన్ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చొరవ చూపి సీఓఏ అనుమతి వచ్చేలా చర్యలు తీసుకొని యూనివర్సిటీకి కేటాయించిన స్థలం శాశ్వత భవనాలు నిర్మించాలని కోరారు.

మంత్రి లోకేష్ స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం

విద్యార్థుల దీక్షలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి. సాయిదత్త, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. రవి తదితరులు మద్దతు ప్రకటించి దీక్షల్లో కూర్చున్నారు. ఈ సమస్యపై మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు శివారెడ్డి, సాయికుమార్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, నగర కార్యదర్శి తేజ పాల్గొన్నారు. సాయిరెడ్డి, రామ్, మేఘసాయి, పవిత్ర, సుష్మ, సుధీర్, సుధాకర్, ఆదిత్య, వసంత్, సింధు, మోహన్, మనోజ్ దీక్షల్లో కూర్చున్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

కడప ఎడ్యుకేషన్ : ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల విద్యార్థి యువజన సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఐక్యవేదిక నాయకులు ఎం.అంకన్న, సుబ్బారాయుడు, జయవర్ధన్, నాగరాజు, నాగేశ్వరరావు, మహేష్ ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన మస్తాన్

పీలేరు రూరల్ : ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి పీలేరు పట్టణం రాజీవ్ నగర్ కాలనీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్ (30) యమహా షోరూంలో పని చేస్తున్నాడు. తరచూ బంధువులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తన నివాసంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



గాయపడిన జింక

తంబళ్లపల్లె : కుక్కల దాడిలో కృష్ణ జింక తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. బెంగళూరు ఎస్.మల్లికార్జునరెడ్డి బంద్రేవు వద్ద ఉన్న తన తోట నుంచి స్వగ్రామం గోపిదిన్నెకు వస్తుండగా రోడ్డు పక్కన రెండు ఊర కుక్కలు కృష్ణ జింకపై దాడి చేయడం గమనించాడు. వెంటనే కుక్కల బారి నుంచి జింకను కాపాడి తన తోట వద్దకు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఫారెస్టు బీట్ ఆఫీసర్ రామరాజ్. వెటర్నటీ డాక్టర్ ఇందులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం వారు 104 పశువైద్య అంబులెన్స్‌లో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన జింకకు చికిత్స చేశారు. తీవ్ర గాయాలు కావడంతో అదే అంబులెన్స్‌లో మదనపల్లె పశువైద్యశాలకు తరలించారు.

గంజాయి విక్రేత అరెస్టు



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ బాబు, ఎస్ఐ, పోలీసులు

సిద్దవటం : కడప నగరం శంకరాపురం ప్రాంతానికి చెందిన రెడ్డి సురేష్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ మాట్లాడుతూ సిద్దవటం మండలం భాకరాపేటలో గంజాయి అమ్ముతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. దీంతో తమ సిబ్బందితో వెళ్లి అక్కడి మూడు రోడ్ల కూడలిలో గంజాయి విక్రయిస్తున్న రెడ్డి సురేష్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్దనుంచి 1కిలో 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు రెడ్డిసురేష్‌ను విచారించగా విశాఖపట్టణం సమీపంలోని చింతపల్లి గ్రామంలో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి వైఎస్సార్ కడప జిల్లా పరిసర ప్రాంతాలలో గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవాడని తెలిసిందన్నారు. ఈ మేరకు నిందితుడిని సిద్దవటం కోర్టులో హాజరు పరచగా జడ్జి 15 రోజులు రిమాండుకు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన నాగవేణి అనే మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. నాగవేణికి కడపకు చెందిన వెంకటసుబ్బయ్యతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన అతను గత 2 సంవత్సరాల నుంచి వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు స్విమ్స్‌లో వైద్య పరీక్షలు

- టీడీపీ తోరణాల తొలగింపు ఘటనలో అక్రమ కేసు
- పోలీసుల థర్డ్‌డిగ్రీపై హైకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- తిరుపతి స్విమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిన హైకోర్టు



స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ రిపోర్టు చూపుతున్న బాధితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడపలో మహానాడు సందర్భంగా టీడీపీ నాయకులు పులివెందులలోని రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ తోరణాలు, జెండాలు కట్టిన విషయం విదితమే. దీనిపై అప్పట్లో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు పులివెందుల డీఎస్పీని, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి టీడీపీ తోరణాలు తొలగించాలని వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించకపోవడంతో మున్సిపల్ చైర్మన్‌తో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న తోరణాలను తొలగించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసు

అప్పట్లో జిల్లాలో ఉన్న హోం శాఖ మంత్రి అనిత, పులివెందుల టీడీపీ నాయకుల ఆదే శాల మేరకు పోలీసులు దాదాపు 18 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వీరిలో 13 మందిని అరెస్టు చేసి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. అనంతరం వారిని పులివెందుల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా అక్కడ వైఎస్సార్ సీపీ నాయకులు పార్నపల్లె కిశోర్, సాతుపాటి రాజేష్, తావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లి వెంకట చలపతి, సాతుపాటి వెంకటపతిలు తమను పోలీసులు అకారణంగా కొట్టారని మెజిస్ట్రేట్ ఎదుట వాపోయారు. దీంతో పులివెందుల మెజిస్ట్రేట్ వారికి పులివెందుల గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

రిపోర్టుల్లో అవకతవకలు

అప్పట్లో పులివెందుల మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఆరుగురికి పులివెందుల జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలనివేదికల్లో అనేక అవకతవకలు జరిగాయని సమాచారం. వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో వైద్యులు, సూపరింటెండెంట్‌పై పులివెందుల పోలీసులు అధికార పార్టీ నాయకులచే ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా నివేదికలు తయారు చేసుకున్నారు. దీంతో ఆరుగురు వైఎస్సార్ సీపీ నాయకులు వైద్య పరీక్షల నివేదికను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఆరుగురికి మరలా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి కేంద్రంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐలు చాంద్‌బాషా, వెంకట రమణ పెద్ద ఎత్తున పైరవీలు చేశారు. వీరు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మంతనాలు జరపడం మీడియా సాక్షిగా బయట పడింది. అంతేకాకుండా కర్నూలు డీఎస్పీ కూడా తమకేమాత్రం సంబంధం లేకున్నా ఆస్పత్రికి వెళ్లి నివేదికలను మేనేజ్ చేసినట్లు సమాచారం. ఈ పరిస్థితిలో మరలా ఆరుగురు వైఎస్సార్‌సీపీ నాయకులు తమకు జరిగిన అన్యాయంపై సాక్ష్యాధారాలతో హైకోర్టుకు నివేదించి ప్రైవేటు కంప్లైంటు వేశారు. దీంతో హైకోర్టు మరలా వీరికి తిరుపతి స్విమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించాలని పులివెందుల సీఐ చాంద్‌బాషాను ఆదేశించింది.

తిరుపతి స్విమ్స్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు

హైకోర్టు ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులను శనివారం ఉదయం 7 గంటలకు పులివెందుల నుంచి అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, రూరల్ సీఐ వెంకట రమణలు నివేదికలు తమకు అనుకూలంగా ఉండాలని మేనేజ్ చేసినట్లు సమాచారం. నిష్పక్షపాతంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని అధికార పార్టీ నాయకులతో స్విమ్స్ ఆస్పత్రి పెద్దలపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.